లోనూ, యౌవనంలోనూ జరిగినవి. ఈ అల్లర్లన్నీ ఆయన ముసలిస్నేహితులు నాకు చెప్పినవే.

'ఒరేయ్ చంటీ! మీ నాయన ఎంత అల్లరివాడనుకున్నావ్?' చేసెల్లా నమ్మను? ఎంత ప్రశాంతుడుగా కనిపిస్తున్నాడు. ఎప్పుడైనా అల్లరి చేసినవాడని అనుకోగలమా? అందుకనే పెద్దలంటారు. చిన్నతనపు అల్లర్లు పెద్దతనంలో నిర్వికల్ప సమాధుల్ని సృష్టిస్తుంటాయి అని.

కాని నాటకాలకోసం మా నాయన ఎంత అల్లరి చేసేవాడో? రాత్రికి రాత్రి నూ పర్లెంచి యిరవై మైళ్లూ నడిచి నడిచి గున్నేశ్వరాపు పెంటాలుకు చేరుకోలేదూ? రాత్రికి రాత్రి పెద్ద కాపుగారి దొడ్లో కొబ్బరికాయలు తీసి కోమటి దుకాణంమీద అమ్మి చుట్టలు పిరాయించుకో లేదూ?

అల్లాంటి మా అల్లరి నాయన ఏడీ? లేడు. ఎక్కడికో ఎందుకో వెళ్ళిపోయాడు. ఆయన చెప్పిన విషయాలు చాలావరకూ సత్యదూరం కాని విషయాలు. ఈ కాలపు కుర్రాళ్ళల్లో చాలామంది తల్లి తండ్రుల మాటల్ని వినడం లేదని తెలుసుకున్నప్పుడు ఆయన ఎంత బాధపడేవారో? సమాజం బాగుపడాలంటే తరతరాల శక్తుల్ని ఎంత చక్కగా అవగాహన చేసుకోవాలి? అల్లా చేసుకున్నట్టయితే పాత గోడల మీద క్రొత్త పూతలు పూసిన మహదానందం మనం అనుభవిస్తాము. వృద్ధాప్యపు అతీత మేధశ్శక్తిలో యువకుల ఉష్ణ రక్తపు తీవ్రత కలిసి యుగ యుగాల ఆనంద శిఖరాల్ని అంటుతుంది. ఈ సృష్టి రహస్యాన్ని తెలుసుకున్న వారిలో మా నాయన ఒకడు. ఆయన నన్ను విడిచి వెళ్ళి పోయాడు. నాకు మార్గాన్ని చూపేది ఆయన నాకోసం విడిచివెళ్ళిన ఆ నల్లకళ్ళద్దాలు ఒక్కటే.

స్కెచ్

# పరీక్ష ఫలితం: జీవిత ఫలితం

ఓగేటి శివరామకృష్ణ

రామచంద్రం తన పరీక్ష నెంబరు పత్రికలో ఉండటంచూసి రెండణాలు ఖర్చుపెట్టి హిందూ పత్రిక కొని యింటికి పోవడానికి రోడ్డు పట్టుకొన్నాడు.

'ఏరోయ్ చంద్రం. ఇవాళ రిజల్ట్సు వచ్చాయా ఏమిటీ' అని ప్రశ్నించాడు దార్లో చంద్రం వయస్కుడొకాయన.

'ఆ వచ్చాయోయ్. సెకెండు క్లాస్,-' అన్నాడు చంద్రం.

'కన్‌గ్రాట్యులేషన్సు బాగుంది' అన్నాడా వ్యక్తి.

'ఈ యేడు మా రిజల్ట్సు అనుకున్న ప్రకారం లేవు. ఏమిటో' అన్నాడు చంద్రం.

'సరే. మాకు పార్టీ యెప్పుడు! అంటూ వెళ్లిపోయాడు నవ్వుతూ ఆయన.

'నీతో చెప్పకుండా చేస్తానుటోయ్' - అని చంద్రం మరో చిరునవ్వుతో నడక ప్రారంభించాడు.

తమవీథి సందుమలుపు ప్రవేశించాడు చంద్రం.

'ఏమిటోయ్. చంద్రం, విశేషం.' అని వీథి అరుగుమీద కూర్చున్న ముసలాయన ఒకాయన చంద్రాన్ని చూస్తూ ప్రశ్నించాడు.

'పరీక్ష సెకండు క్లాసులో ప్యాసయ్యా తాతగారూ. రంగారావుగారొచ్చిన తర్వాత చెప్పండి' అంటూ వెళ్ళిపోబోయ్యాడు చంద్రం.

'ఆ చాలా సంతోషం. అమ్మాయీ వెంకట్రమణా, మీ కాబోయే అల్లుడు పరీక్ష ప్యాసయేడేవ్ ర్రా నాయనా. అమ్మాయీ రేఖా! మీ బావగారికి ఓ చెంబుతో నీళ్ళు తెచ్చి యివ్వవే,- అంటూ ఆనందంతో బాటు ఆదుర్దా చూపించాడు

'ఆ పనుంది తాతగారూ. ఇంటి దగ్గర యీ సంగతి యింకా తెల్సి ఉండదు. వెళ్ళిచెప్పి రావాలి. ఈ శుభవార్త మామయ్యగారొచ్చిన తర్వాత చెప్పండి' - అంటూ బయలుదేరాడు చంద్రం.

'ఆ చెప్పడమేమిటి. మా రంగడే మీయింటి కొస్తాడులే' అన్నాడు అరుగుమీద కూర్చున్న తాతగారు.

'అయ్యో. అల్లుడు అప్పుడే వెళ్ళిపోయాడే' అనుకొంది రేఖ బయలుగా నీళ్ళు తెచ్చిన కాబోయే అత్తగారు వెంకట్రమణ.

చంద్రం యిల్లు చేరుకొన్నాడు. ఏమిటో ఒక విధమైన సిగ్గు చంద్రాన్ని ఆవహించింది. నలుగురివైపూ తలయెత్తి చూడటం, మాట్లాడటం, అతగాడికి కొంచెం బెదురు కల్గిస్తున్నయ్.

అప్పటికప్పుడే ఎలా యీ వార్త పాకిపోయిందోకాని తండ్రి యింట్లోకి చేరి యిరుగుపొరుగునఉన్న నలుగురితో యేకధాటిగా యేమేమో చెప్పేస్తున్నాడు.

ఆదేసమయంలో అరుగుమీదకుచేరిన చంద్రం గూడా మధ్య మధ్య యేవో రెండు మాటలనక తప్పేదికాదు- 'అవును, యీ యేడు మా యింటర్మీడియేటు రిజల్ట్సు యేంబాగుండలేదు. వాల్యుయేషన్ బాగుండలేదు'- అని ఒకమారూ-

'మన ప్లీడరుగారబ్బాయి ఫస్టుక్లాసులో రావలసినవాడు పాపం ప్యాసవలేదన్నమాట' అని వేరొకమారూ-

'మా కాలేజీలో మట్టుకు గ్రూపు చాలా డిఫెక్టు అయినా ఏమిటో విచిత్రం యీ యేడు గ్రూపులో చాలామంది ప్యాసయ్యారు'- అని మరొకమారూ, పోగయిన- పెద్దలందరితోనూ వాళ్ళు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా- సమయోచితంగా జవాబులిచ్చాడు.

ఇంతలో చెమట తుడుచుకొంటూ రంగారావుగారు గూడా అరుగుమీదకు దయచేశారు!

'ఏమండో బావగారూ' - యిలా దయచేయండి'- అన్నాడు చంద్రం తండ్రి.

'ఆ ... నన్ను గౌరవం చెయ్యాలిటండీ- పరాయివాణ్నా యేమన్నానా. ఏమిటోయ్ చంద్రం విశేషాలు- చాలా సంతోషంగా ఉంది' అనిఅన్నాడు.

'అవునుగాని- వస్తుందనుకన్న క్లాసు రాలేదు' అన్నాడు చంద్రం తండ్రి.

'ఆ. పోనీలెండి. క్లాసుకేం! ఈ యేడు చూశారా, రిజల్ట్సు బాగుండలేదుటగా. పాపం చూశారా ప్లీడరుగారబ్బాయి అర్డనరీ ప్యాస్ కూడా అవలేదట.' అన్నాడు.

'ఆ. అవునవును. అతడు చాలా ఇంటలిజెంటే. మరెందువల్లనో...' అన్నాడు చంద్రం.

'సరే. ముందువిషయం యేంతేల్చేరు. బావగారూ' అంటూ ప్రశ్నించాడు రంగారావుగారు.

'ఏముంది. నాకు తోచటంలేదు. ఇప్పటికే యీ యింటర్మీడియేట్ కే—పూర్తి చేయించేటప్పటికి నా తాతలు దిగివచ్చారు. ముందేం చేదామన్నా డబ్బులోనే గదా. ఏం చెయ్యమంటారు?' అన్నాడు చంద్రం తండ్రి—

'ఎప్పుడూ యింతే. మీరు పేదఅరుపులు బాగా అరుస్తారు'- అన్నారొకాయన.

'బావగారికది అది అలవాటే'- అన్నాడు రంగారావుగారు.

'ఏం చెయ్యమంటారు బావగారూ. మీ సలహాలు పాటిస్తాను. ఇవ్వండి'- అన్నాడు చంద్రం తండ్రి నవ్వుతూ. 'బాగుంది రంగారావుగారూ. చంద్రం మీకు కాబోయే అల్లుడు. మీ సలహాలను తప్పక పాటిస్తారు యివ్వండి-' అన్నాడు యింకోఆయన.

'సరే మీరు యింతగా చెప్పాలా. అయితే చంద్రం- ఇంజనీరింగుకు వెళ్ళాలనే ఉద్దేశం నీకు ఉందా?'

'ఆ, నాకు యింకా దేనిమీదా అభిప్రాయం లేదండీ' అంటూ తప్పుకోబోయ్యాడు చంద్రం.

'అభిప్రాయం లేకపోవటం యేమిటి' ఇంజనీరింగులో సీటు దొరికితే-చాలా అదృష్టవంతులం అన్నాడు చంద్రం తండ్రి.

'అవున్లెండి. దానికో కాగితం పడెయ్యవోయ్.' అన్నాడు చంద్రం.



'సరే లెండి'- అన్నాడు చంద్రం.

'పడేయటంతోటి సరిపోతుందిటండీ బావ గారూ. ఏదో తగిన ప్రయత్నం చెయ్యాలి. అన్నాడు చంద్రం తండ్రి.

'ఓస్ దానికేంలెండి. ఏదో ఒకటి అవుతుంది. చంద్రం, పత్రికల్లో చూసిన ప్రతిదానికి ఒక్కొక్క కాగితం వ్రాసి పడయ్యాలోయ్. తరువాత యేదో ఒకటి అవుతుంది.'

'వేటికివేటికి పడెయ్య మంటారు?'

'ఏం చెప్పనండి. డాక్టరు పరీక్షకు మనకు సీటు దొరికితే మనం అట్టే తిప్పలుపడ నవసరం లేదు. మద్రాసులో మనవాళ్లున్నారు. చంద్రం అక్కడేఉండి చదువుకోవచ్చు. ఇంజనీరింగులో సీటు దొరికితే మనం చాలా అదృష్టవంతులం. బి. ఏ. గాని చదువుతే ప్రయోజనం లేదు. ఏమయితేనేం చంద్రం. టెక్నికల్ వాట్లతో బాటు మామూలు కాలేజీలకుగూడా దరఖాస్తులు పంపవోయ్. ఏదో ఒకటి అవుతుంది'- అన్నారు రంగారావుగారు.

'సరేలెండి' అన్నాడు చంద్రం.

'పాపం చాలా శ్రమపడి వచ్చారు ఎండలో' అన్నాడు చంద్రం తండ్రి.

'ఆ ఏముందిలెండి. ఇంటికెళ్ళాను. ఆవిడ చెప్పింది అల్లుడు పరీక్ష పాసయ్యాడనీ యింటికి వచ్చాడనీ. ఆకాస్తఆనందంలో నేనూ పాలు పుచ్చుకోవలసిన వాడనేగా'

'ఆ చంద్రం తమ అల్లుడయినప్పుడు పాలు పుచ్చుకోపోతే యెట్లాగా' అన్నాడు ఒకాయన నవ్వుతూ.

'పోనీ శాస్త్రిల్లుగారూ! మీరు చెప్పినదే అనుకోండి' నవ్వుతూ రంగారావుగారనసాగాడు. 'చంద్రం మాఅల్లుడు క బోతున్నప్పుడు చంద్రం ఆనందం మాఆనందంకాదూ? అందుకనే వచ్చా. వస్తా బావగారూ. పాపం నామూలకంగా మీకు గూడా యింతవరకూ భోజనంలేదు'

'ఆ దానికేలెండి. మీరల్లా అంటూఉంటారు అయితే మీ మూలకంగా మాకు భోజనాలు లేవనుకొనే బదులు మామూలకంగా మీకు భోజనాలు లేవని మాత్రం యెందుకనుకో గూడదు?' అంటూ- నవ్వాడు చంద్రం తండ్రి.

'అదే అనుకోండి. మరి వెళ్లొస్తా' - అంటూ నవ్వుతూ వెళ్ళిపోయాడు రంగారావుగారు. ఓ పదిగజాల దూరం సాగనంపాడు రంగారావు గార్ని చంద్రం తండ్రి!'

సరి ఆరోజు మొదలు చంద్రం తండ్రి — చంద్రాన్ని తిప్పలు పెట్టడం ప్రారంభించాడు. చూసిన ప్రతీప్రకటనకూ పోస్టేజీ ఖర్చులకు బాధ పడకుండా భరించి, దరఖాస్తులు పెట్టించాడు. కనిపించిన ప్రతీవాళ్ళతోటీ 'మా అబ్బాయిని ఇంజనీరింగు పరీక్షకు చదవ పంపుతున్నా' అని ఒక మారూ- 'నేచెప్పించేదేముందిలెండి. మాఅబ్బాయి కాబోయే మామగారు ఇంజనీరింగులోనో డాక్టర్లోనో సీటు ఇప్పించి చదివిస్తానన్నారు. వాడి గొడవ యేదోవిధంగా ఆయనే చూసుకొంటారు' అని మరొకమారు. 'మా వాడికి సెకండు క్లాసు వచ్చింది. దేంట్లోనూ సీటుదొరకదు!' అని వేరొకమారూ, పలువిధాలుగా అంటూడేవాడు.

రంగారావుగారుగూడా అల్లునిమీద ఉడతా భక్తిని ప్రదర్శిస్తూ రెండుమార్లు మద్రాసు తిరిగి వచ్చి ఏదో ఎవర్నో కలుసుకొన్నాననీ, సీట్లు వచ్చేస్తున్నాయనీ ఏమేమో చెప్పసాగాడు.

చంద్రం తండ్రి - రంగారావుగారు చెప్పే మాటలయెడ భక్తివిశ్వాసాలు కలిగియుండటం వల్ల కొడుకు భవిష్యత్తు విషయం ఆలోచిస్తూ ఆనందం పొందసాగాడు. చంద్రం, కుటుంబంలో వాళ్ళంతాగూడా ఆలా ఆనందం అనుభవించారు. ఈ ఆనందంతో పాటు, యెంతో కాలం నుంచి యెదురుచూస్తున్న రంగారావు కూతురు వివాహం నిముషాల్లో జరిగిపోయింది. చంద్రం రంగారావు అల్లుడయ్యాడు.

* * *

ఇప్పటికి రెండు సంవత్సరాలు గడిచినాయ్, చంద్రం యింటర్మీడియేటు పరీక్ష ప్యాసయి. అయితే యింతవరకూ ఏ టెక్నికల్ కాలేజీ లోనూ సీటు రాలేదు గాని, చంద్రం భార్య కాపురానికి రావటం, మామ ప్రోత్సాహంతో, చంద్రం సర్వీసు కమీషను పరీక్షకు కూర్చోనటం జరిగాయి. ఇదేనా 'భవిష్యత్తు' అనుకొన్నాడు చంద్రం.